

కార్పొరేషన్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కార్పొరేషన్ అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా పెద్ద ఎత్తున నిధులు మంజూరుచేసిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ 38వ డివిజన్ ఇందిరానగర్‌లో రూ.40లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఓపెన్ డ్రైన్, సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ పథకం కింద రోడ్లు, డ్రైనేజీ, నగర సుందరీకరణ తదితర పనులకు రూ.100కోట్ల నిధులు వెచ్చించగా పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎస్టీపీల పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. నగర సుందరీకరణలో అనేక మార్పులు తీసుకువస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రామగుండం నగరపాలక సంస్థకు రావాల్సిన నిధులను కమిషన్లకు కక్కుర్తిపడి బీఆర్ఎస్ అగ్రనాయకులకు ధారదత్తం చేశారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే ఓర్వలేక ప్రజలను రెచ్చగొట్టి తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు జంగంపల్లి సరోజన, ముస్తాఫా, నాయకులు దీటి బాలరాజు, మేకల పోషం, నజీమోద్దీన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

25లోగా బాలికలు దరఖాస్తు సమర్పించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వివిధ కారణాలతో చదువు మానేసిన బాలికలు మళ్లీ ఉన్నత విద్య అభ్యసించేందుకు ఈనెల 25లోపు దరఖాస్తు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి పి. వేణుగోపాలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారికి అవసరమైన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని, దరఖాస్తుతో పాటు గతంలో చదివిన విద్యార్హత సర్టిఫికెట్స్‌తోపాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను జతచేస్తూ జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ఈనెల 25లోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 7382452944, 8106372037 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం డిసెంబర్ 31లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి పి వేణుగోపాలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు (అంగ వైకల్యం కనిపించినట్లు), వైద్య ధ్రువీకరణ పత్రం, ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు ఆన్‌లైన్‌లో http://telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని, ఆ దరఖాస్తు ప్రింట్‌తో పాఠశాల ప్రభుత్వ గుర్తింపు పత్రం జతపరిచి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 7013755418 ఫోన్ నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

కోల్‌సిటీటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆదిత్యా అనఘా మల్టీ స్టేట్ క్రెడిట్ కార్పొరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ సుబ్బారావు, మెంటర్ పి.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆఫీసర్, సీనియర్ ఆఫీసర్, అసిస్టెంట్ బ్రాంచ్‌మేనేజర్, బ్రాంచ్‌మేనేజర్ స్థానాలను భర్తీచేయనున్నట్టు, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్స్‌తోపాటు రెస్యూమ్, రెండు పాస్‌ఫోటోలతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

కళ్యాణ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జనగామలోని హనుమాన్ యూత్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రాపెల్లి నరేందర్, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి సంపత్, ఉపాధ్యక్షునిగా రాపెల్లి మహేందర్, కోశాధికారిగా మల్క మారుతి, జాయింట్ సెక్రటరీగా నీలం సంజీవ్, కార్యవర్గ సభ్యులుగా నీలం తిరుపతి, ఆకుల అనీల్, గాదె అభిలాష్, బట్టు ప్రసాద్, మధుకర్‌ను ఎన్నుకున్నారు.

ఐఎంఏ అధ్యక్షుడికి సన్మానం

కళ్యాణ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఐఎంఏ అధ్యక్షునిగా ఎన్నికైన క్యాస శ్రీనివాస్‌ను బుధవారంరాత్రి గోదావరిఖని ల్యాబ్ టెక్నీషియన్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ అధ్యక్షుడు కుమర్ మాట్లాడుతూ ల్యాబ్ తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేయాలని వారు అధ్యక్షునికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి శ్రీనివాస్, లంక సదానందం, మేకల తిరుపతి, ప్రదీప్, వాసు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణాలేంటి?

- గూడ్స్ రైలు పట్టాలు తప్పడంపై రైల్వే అధికారులు విచారణ
- ట్రాక్ నిర్వహణపై ఆరా..
- వేగంగా పునరుద్ధరణ పనులు
- నేటి ఉదయం వరకు ట్రాక్ పునరుద్ధరించే అవకాశాలు
- పలు రైళ్ల రాకపోకలు రద్దు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని రాఘవాపూర్ వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ప్రమాదనికి కారణాలేమిటనే విషయపై రైల్వే అధికారులు ఆరా తీస్తున్నారు. ఘటనకు ఓవర్ లోడ్ కారణమా, ట్రాక్ నిర్వహణ లోపమా అనే విషయాలపై ఆరాతీస్తున్నారు. ఢిల్లీ, సికింద్రాబాద్, చెన్నై ప్రధానలైన్ కావడంతో దెబ్బతిన్న రైల్వే ట్రాక్, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారు. గురువారం ఉదయం వరకు పూర్తి స్థాయిలో లైన్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం రాత్రి పెద్దపల్లి, రామగుండం మార్గ మధ్యమలోని కన్నాల బోడగుట్ట 282/38, 282/34 కిలోమీటర్ల మధ్యన ఈ ప్రమాదం సంభవించినట్టుగా రైల్వే అధికారులు గుర్తించారు. మొత్తం 11 బోగీలు పట్టాలు తప్పాయి. ఐరన్ కాయిల్స్ తరలిస్తున్న గూడ్స్ రైలు కాబట్టి ఆస్తినష్టం తప్ప ప్రాణనష్టం జరగలేదు. ఇదే సమయంలో ప్రయాణికులు వెళ్లే రైలు పట్టాలు తప్పినట్టయితే మాత్రం భారీ ప్రాణ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చేదని ఘటన తీరును బట్టి స్పష్టం అవుతోంది.

ట్రాక్ మెయింటనెన్స్‌పై ఆరా!

ట్రాక్ మెయింటనెన్స్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకుంది? అన్న కోణంలో కూడా రైల్వే అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. దక్షిణ భారత దేశానికి, ఉత్తర భారత దేశానికి అనుసంధానం చేసే ప్రధాన రైల్వేలైన్ కాబట్టి తరచూ ఈ ట్రాక్ సామర్థ్యం ఎలా ఉంది, ట్రాక్ కింది భాగంలో భూమి కుంగుబాటుకు గురవుతుందా..? ట్రాక్ సమీపంలో నీటి నిలువ ఉన్నట్టయితే వాటిని మళ్లించడం వంటి చర్యలు చేపట్టాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు ట్రాక్ మెయింటెనెన్స్ వింగ్ అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఏకధాటిగా కురిసిన వర్షాల వల్ల ట్రాక్ కింది

మిగతా 8వ పేజీలో...



సంఘటనా స్థలానికి వస్తున్న ఎంపీ వంశీకృష్ణ

ఓవర్ లోడ్ కారణమా..

గూడ్స్ రైలు ఓవర్ లోడ్‌తో ప్రయాణించడమే కారణమా అనే కోణంపై రైల్వే అధికారులు ఆరా తీస్తున్నారు. సామర్థ్యానికి మించి లోడ్ చేయడం వల్లే పట్టాలు తప్పి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే రైల్వే అధికారులు సాధారణంగా ఓవర్ లోడింగ్ విధానం అమలుచేస్తుంటారని, అయితే రెండు కోచుల్లో ఎక్కువ మోతాదులో లోడ్ చేసినట్టయితే మరో కోచులో సాధారణ సామర్థ్యం మేరకు లోడింగ్ చేస్తారని తెలుస్తోంది. దీనివల్ల ట్రాక్‌పై అదనపు భారం పడకుండా ఉండడంతో పాటు ట్రాక్‌పై వెళ్తున్నా ప్రమాదాలు జరగకుండా ఉంటాయని అంచనా వేస్తారని సమాచారం. ట్రైన్ బ్యాలెన్సింగ్ కూడా తప్పే అవకాశం ఉండదని కూడా తెలుస్తోంది. అయితే రాఘవాపూర్ వద్ద మంగళవారం రాత్రి పట్టాలు తప్పిన గూడ్సులోని అన్ని కోచుల్లోనూ సామర్థ్యానికి మించి లోడింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అనుకుంటున్నారు. సాధారణంగా గూడ్సు రైళ్లలో లోడింగ్ చేసేప్పుడు ఇలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు సాంకేతిక నిపుణులు కూడా పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ట్రాక్‌పై వెళ్తున్నప్పుడు ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటూ లోడింగ్ చేయాల్సి ఉంటుందని సమాచారం. అలాంటప్పుడు గజియాబాద్ నుంచి వెళ్తున్న గూడ్సు రైలులో మాత్రం ఇలాంటి జాగ్రత్తలు తీసుకోలేదా?, సాంకేతిక విభాగం ఈ అంశాన్ని పట్టించుకోలేదా..? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



రామగుండంలోని ఎన్టీపీసీ

దక్షిణాది కొంగు బంగారం

- నేడు రామగుండం ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం

6



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి

- ఇంటింటి సర్వే వివరాలను పకడ్బందీగా సేకరించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

8

రామగుండం కార్పొరేషన్‌కు కొత్త వాహనాలు

రూ.2.77కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు



కార్పొరేషన్ కొనుగోలు చేసిన కొత్త వాహనాలు

కోల్‌సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగానికి కొత్త వాహనాలు సమకూరనున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు, బ్లేడ్‌ట్రాక్టర్లు పాతవి అయి జీవితకాలం కూడా పూర్తయ్యింది. గతంలో 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.8కోట్లు వెచ్చించి అవసరం లేని వాహనాలను కొనుగోలు చేశారు. నిధుల దుర్వినియోగం కూడా జరిగింది. పారిశుధ్య విభాగంలో చెత్త సేకరణకు అవసరమైన వాహనాలు లేకపోవడంతో ప్రతిఏటా ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకుంటున్నారు. వాహనాల అద్దెపేర రూ.కోటి నుంచి రూ.1.5కోట్లు వెచ్చిస్తున్నారు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో వాహనాలు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రతిపాదించారు. 15వ ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్ నిధులతో వాహనాలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రూ.90లక్షల వ్యయంతో 10ట్రాక్టర్లు, రూ.65లక్షల వ్యయంతో రూ.8 ఆటో ట్రాలీలు, రూ.74లక్షల వ్యయంతో రెండు జేసీబీలు, రూ.34లక్షల వ్యయంతో 3బ్లేడ్ ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి టెండర్లప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఇప్పటికే ఐదు ట్రాక్టర్లు, మూడు ఆటోట్రాలీలు కార్పొరేషన్‌కు వచ్చాయి. వీటికి తోడు వాణిజ్య ప్రాంతాల్లో చెత్త బయట పడవేయకుండా ఉండేందుకు 70స్టాండ్‌బిన్స్, 100పుష్‌కాట్లు తెప్పించారు. ప్రస్తుతం నగరపాలక సంస్థలో 20ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ఒక జేసీబీ, 14 ట్రాక్టర్లు, రెండు లెవల్ బ్లేడ్ ట్రాక్టర్లు, 47ఆటో ట్రాలీలు ఉన్నాయి. ట్రాక్టర్లు, జేసీబీ జీవిత కాలం కూడా పూర్తయ్యింది. గతంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో వాహనాల కొనుగోలుకు అవకాశం ఉన్నా యంత్రాంగం దానిపై దృష్టి పెట్టలేదు. రోడ్ క్లీనింగ్ మిషన్, బాబ్‌కార్ట్, జెట్టింగ్ మిషన్, లిట్టర్ పిక్కర్, తదితర యంత్రాలను కొనుగోలు చేశారు. రోడ్‌స్వీపింగ్ మిషన్, జెట్టింగ్‌మిషన్ మూలనపడే ఉన్నాయి. కార్పొరేషన్‌లో ఇంటింటా చెత్త సేకరణకు వాహనాల అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న వాహనాలు తుక్కుగా మారడంతో చెత్త సేకరణ గగనమవుతుంది. ఈ పరిస్థితుల్లో కొత్త వాహనాల కొనుగోలు చేయడం కార్పొరేషన్‌కు ఊరటనిచ్చినట్టు అవుతుంది.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామానికి చెందిన పెసరి స్వామి కుటుంబ సభ్యులకు ఎన్ఆర్ఐ కొలుముల దామోదర్ తన ఫౌండేషన్ ఇన్‌చార్జ్ వేల్పుల నాగరాజు ద్వారా 5వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి భార్య స్వప్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కటికెనపల్లి గ్రామ ఇన్‌చార్జి ఆవుల మహేష్, బోనగిరి వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ గంగారెడ్డి, తుమ్మ కనకమ్మ, మస్కం సత్యం, పెసరి రాజయ్య మల్లెతుల రవి తదితరులు ఉన్నారు.

ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరిగౌడ్



యాదగిరిగౌడ్

జ్యోతినగర్/అంతర్గాం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా స్థానిక విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్‌ను ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బందారపు యాదగిరిగౌడ్ ఎన్నుకున్నారు. యాదగిరిగౌడ్ నియామకంపై ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కంది రవిందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు అంజారెడ్డి, సెక్రెటరీ తిరుపతిరెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు సమ్మారావు, రాంచంద్రారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అరుణాచలం బస్సును ప్రారంభించిన డీఎం



బస్సును ప్రారంభిస్తున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లే బస్సును బుధవారం డిపో మేనేజర్ నాగభూషణం బస్టాండ్‌లో ప్రారంభించారు. గురువారం ఉదయం కాణిపాకం చేరుకుని అక్కడి నుంచి వెళ్లూరు గోల్డెన్ టెంపుల్, లక్ష్మీమాత దర్శనం అనంతరం సాయంత్రం అరుణాచలంకు చేరుకుంటుందని, 15న సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి 16న ఉదయం జోగులాంబ గద్వాల్ అమ్మవారి దర్శనం, సాయంత్రం గోదావరిఖని డిపోకు చేరుకుంటుందని డీఎం చెప్పారు. ప్రయాణికులకు పండ్లు, పులిహోర ప్యాకెట్లు అందించడంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం కోఆర్డినేటర్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీతకృష్ణ, మెకానికల్ ఇంజనీర్ సంధ్యరాణి పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్ విడుదల

జ్యోతినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సీపీఎం 3వ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌న బుధవారం పార్టీ నాయకులు విడుదల చేశారు. మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకుడు వై.యాకయ్య కోరారు. మహాసభలలో భాగంగా మొదటి రోజులు ఈనెల 23న సాయంత్రం ఎన్టీపీసీ ప్లాంటు 2వ గేటు నుంచి భారీ ర్యాలీ, ప్రదర్శన ఉంటుందని యాకయ్య తెలిపారు. అనంతరం మేడిపల్లి సెంటరులో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. 24న సీపీఎం జిల్లా ప్రతినిధుల సమావేశం ఉంటుందని, కొత్త కమిటీని ఎన్నుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాంసాని శంకర్, రామాచారి, ఎఎస్.బిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, మల్లేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్ట మధు ఆరోపణలు అర్థరహితం

రామగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మంథని బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పుట్ట మధు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఆరోపించారు. మండలంలోని సెంటినరీకాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంథని ప్రాంత అభివృద్ధి పుట్టమధుకు కనిపించడం లేదన్నారు. మంత్రి శ్రీధర్ బాబుపై మరోసారి ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్ 3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- టీజీపీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 3 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రూప్3 పరీక్షల ఏర్పాట్లు, సన్నద్ధతపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ఈనెల 17ఉదయం 10గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 5.30 వరకు రెండు సెషన్లు, 18న ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు గ్రూప్ 2 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు పక్కాగా జరగాలని అధికారులకు సూచించారు. గ్రూప్3 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా జిల్లాస్థాయిలో చేస్తున్న ఏర్పాట్ల వివరాలను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రాలు, ఇతర ముఖ్యమైన సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లో స్టోర్ చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30గంటలకు మూసివేస్తామని, ఆ తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదని, ఈ అంశాన్ని అభ్యర్థులకు చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144సెక్షన్ అమలు చేయాలని, ఎక్కడ ఎటువంటి పొరపాటు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి 3 నుంచి 4 పరీక్ష కేంద్రాలకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటుచేయాలని, పారదర్శకంగా పరీక్షలు జరిగేలా చూడాలని సూచించారు. గ్రూప్ పరీక్షల నిర్వహణకు ఎంపికచేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీచేసి అక్కడ అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రశ్న పత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు వీలుగా జాయింట్ రూట్ అధికారులను నియమించాలని, ప్రతి 150మంది అభ్యర్థులకు ఒక ఐడెంటిఫికేషన్ అధికారులు గానీ నియమించాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు రూ.50 లక్షల పరిహారం ఇప్పించాలి

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధు

పెద్దపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు 50లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే నిర్మాణంలో మంథని నియోజకవర్గంలో వందల ఎకరాల్లో భూములు పోతున్నాయని, అందులో మంథని మండలం పుట్టపాక ప్రధాన రహదారి పక్కనే ఉన్న భూములకు ప్రస్తుతం కోటి రూపాయల విలువ ఉందన్నారు. ఈ క్రమంలో మంథని ఎమ్మెల్యే 25లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలని లేఖ రాశాడన్నారు. అయితే ప్రధానమంత్రికి రాసిన లేఖ తెలుగులో రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడానికి ఇలా చేశాడన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనే ఉందని, మంథని ఎమ్మెల్యే మంత్రి హోదాలో ఉండి కూడా ఇప్పటివరకు నేషనల్ హైవే నిర్వాసితులకు న్యాయం చేయాలనే ఆలోచన చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్వాసితులకు ముందుగా మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి ఫీల్డ్‌లోకి రావాలన్నారు. మంథని ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే నిర్వాసితులకు ఎకరాకు రూ.50లక్షలు ఇప్పించాలని, ఇండ్లకు సైతం సరైన కొలతలు తీసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గుజ్జుల రాజిరెడ్డి, అత్తె చంద్రమౌళి, ప్రకాష్ రెడ్డి,నూనె కుమార్, సుదాటి రవీందర్‌రావు, కాపురబోయిన భాస్కర్, పెగడ శ్రీనివాస్, రొడ్డ శ్రీనివాస్, మధు ఉన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. బుధవారం అంతర్గాం మండల పరిధిలోని మూర్మూర్, ఎల్లంపల్లి, బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఈ మేరకు మాట్లాడారు. తూకంలో ఎటువంటి కోతలు విధించకుండా వరి ధాన్యం కొనుగోళ్లు జరపాలని అధికారులను వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులు పండించిన వరి పంటకు ఈ సీజన్ నుండే రూ.500 బోనస్ చెల్లించనున్నట్టు పేర్కొన్నారు. రైతుల కళ్ళల్లో ఆనందం చూడటమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో అలీం, సింగిల్ విండో చైర్మన్ మామిడాల ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, పెంద్రు హనుమాన్‌రెడ్డి, మడ్డి వెంకటేష్‌గౌడ్, మడ్డి తిరుపతిగౌడ్, గాదె సుధాకర్, సింగం కిరణ్‌గౌడ్, గుంట బాపు, బొడకుంట సంతోష్, బరుపటి శ్రీనివాస్, బరుపటి తిరుపతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

దుబాయిలో అంబారిపేట మహిళ మృతి



సుప్రియ (ఫైల్)

కథలాపూర్/గల్ఫ్ ప్రతినిధి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేటకు చెందిన ఎన్నమనేని సుప్రియ (35) అనే వివాహిత దుబాయిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం... సుప్రియకు రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన శ్రీనివాసరావుతో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లైన కొన్నేళ్లకే దుబాయికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. గత సోమవారం కొడుకు, కూతురును పాఠశాలకు పంపించగా భర్త శ్రీనివాసరావు ఎప్పటి మాదిరిగానే విధులకు వెళ్లాడు. సాయంత్రం వారు ఇంటికి వచ్చే సరికి సుప్రియ మృతి చెంది ఉంది. ఆమె మృతికి గల కారణాలు తెలియలేదు. సుప్రియ మృతదేహం స్వగ్రామం చేరుకోడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు.

రైలు కింద పడి చింతలూరువాసి మృతి



శ్రీకర్(ఫైల్)

రాయికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన ముద్దం శ్రీకర్ ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైలు ఎక్కుతూ రైలు కింద పడి మరణించాడు. చింతలూరు గ్రామానికి చెందిన శ్రీకర్ ఈ నెల 8న కుటుంబ సభ్యులతో కలిసి తిరు పతి దైవదర్శనానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు గూడూరు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ కింద పడి మర ణించాడు. విషయం తెలిసిన గ్రామ నాయ కులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌తో మాట్లాడి మృతదేహాన్ని త్వరి తగతిన తెలంగాణకు పంపాలని కోరా రు. అలాగే కలెక్టర్ సత్యప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం పక్షాన అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

కోరుట్ల, నవం బరు 13 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ప్రకా శం రోడ్డుకు చెం ది న ఉదయశ్రీ (20) అనే బీ ఫార్మసీ విద్యార్థిని బుధవారం వరంగల్ జిల్లా కేం ద్రంలోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతి చెందాడు. ఉదయశ్రీ వరంగ ల్ ఓ ప్రైవేట్ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతోంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివా రం తిరుపతి వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. రైలు ఎక్కుతున్న క్రమం లో ఉదయశ్రీ ప్రమాదవశాత్తు ప్లాట్ ఫారం నుంచి కింద పట్టాలపై పడిపోయింది. గమనించిన రైల్వే సిబ్బంది తీవ్రగాయాలు పాలైన ఉదయశ్రీని వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తుం డగా బుధవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఒక్కగానొక్క కూతురు మృత్యువాత పడడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


జగిత్యాలలో చోరీ

జగిత్యాల క్రైం, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో చోరీ జరిగింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన కం దుకూరి రాఘవయ్య అనే రిటైర్డు ఎంఈవో పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న బ్యాంకులో తన అవసరం నిమిత్తం లక్ష రూపాయలు విత్ డ్రా చేశాడు. అనంతరం కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మీ సేవలో లైఫ్ సర్టిఫికేట్ కోసం వెళ్లాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనం దగ్గరికి గుర్తు తెలియని వ్యక్తి ద్వి చక్ర వాహనంపై వచ్చి రాఘవయ్యతో మాట మాట కలిపి జేబులోంచి డబ్బులు కింద పడిపోయాయని నమ్మించాడు. రాఘవయ్య కిందికి వంగి చూసే లోపే తన ద్విచక్ర వాహనం ముందు ఉన్న లక్ష రుపాయల నగదు బ్యాగును అపహరించుకవెళ్లాడు. తేరుకున్న బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచిర్యాల జిల్లా బీమ్‌నూర్ గ్రామానికి చెందిన మావినేని రమేష్ (45) అనే వ్యక్తి బుధవారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్ రెండో టౌన్ హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 8న ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడన్నారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని తెలిపారు. రమేష్ వివరాలు తెలపలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్ర పరిచామన్నారు.

దక్షిణాది కొంగు బంగారం



పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తోంది. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తితో పాటు నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ దక్షిణాది కొంగుబంగారంగా గుర్తింపు పొందింది. సామాజిక బాధ్యతలో భాగంగా ఏటా లక్షలాది రూపాయల ఖర్చుతో ఆయా గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులను కైవసం చేసుకున్న ఈ 'వెలుగుల దివ్వె' 46 వసంతాలు పూర్తి చేసుకుని గురువారం 47వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

నేడు రామగుండం ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం

వెలుగుల దివ్వెకు 47 వసంతాలు

400 మెగావాట్ల తెలంగాణ ఎస్టీపీపీ..

రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు పక్కనే 4000 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు స్టేజ్ 1 కింది నిర్మించిన 800 మెగావాట్ల 2 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. రెండో దశలో మరో 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టును నెలకొల్పనున్నారు. స్టేజ్ 2కు సంబం ధించి ఈనెల 29న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహి స్తున్నారు. ఇటీవలే స్టేజ్ 2కు 29,344.85 కోట్ల రూపాయల వ్యయాన్ని ఎన్టీపీసీ బోర్డు పెట్టుబడిగా ఖరారు చేసింది. ఎల్‌అండ్‌టీ సంస్థకు నిర్మాణ కాంట్రా క్టు దక్కినట్లు సమాచారం. 4000 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తయితే దేశంలోనే ఒకే ప్రాంతం నుంచి అత్యధిక విద్యుత్ ఉత్పత్తి(6600 మెగావాట్లు) చేస్తున్న ప్రాజెక్టుగా రామగుండం ఎన్టీపీసీ గుర్తింపు సాధించనున్నది.

జ్యోతినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో అతి పెద్ద సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం రామగుండం ఎన్టీపీసీ.. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. నిర్దేశిత లక్ష్యాలను అధిగమిస్తూ.. ముందుకు సాగుతోంది.. ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 1978 నవంబరు 14న పునాది రాయి పడిన ఈ వెలుగుల దివ్వె నాలుగున్నర దశాబ్దాలుగా జాతికి వెండి వెలుగులను పంచుతున్నది. నేటితో 47వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ లిమిటెడ్‌కు చెందిన 2600 మెగావాట్ల రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ దక్షిణాది విద్యుత్ అవసరాలను గణనీయంగా తీరుస్తున్నది. ప్రతి ఏటా ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగుతున్నది. 1978 నవంబరు 14 అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ చేతుల మీదుగా పునాది రాయి పడిన ఈ ప్రాజెక్టులోని యూనిట్లు నిర్ణీత గడువుకన్నా ముందే ఉత్పత్తిని ప్రారంభించాయి.

యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభ వివరాలు..

స్టేజ్-1

- 200 మెగావాట్ల 1వ యూనిట్ 1983 అక్టోబర్ 26
- 200 మెగావాట్ల 2వ యూనిట్ 1984 మే
- 200 మెగావాట్ల 3వ యూనిట్ 1984 డిసెంబర్

స్టేజ్-2

- 500 మెగావాట్ల 4వ యూనిట్ 1988 జనవరి
- 500 మెగావాట్ల 5వ యూనిట్ 1989 మార్చి
- 500 మెగావాట్ల 6వ యూనిట్ 1989 అక్టోబర్

స్టేజ్-3


- 500 మెగావాట్ల 7వ యూనిట్ 2004 సెప్టెంబర్

ఏ రాష్ట్రానికి ఎంత విద్యుత్...

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు 754 మెగావాట్లు (29శాతం)
- తమిళనాడుకు 572 మెగావాట్లు(22శాతం)
- కర్నాటకకు 416 మెగావాట్లు(16శాతం)
- కేరళకు 312 మెగావాట్లు(12శాతం)
- గోవాకు 130 మెగావాట్లు(5శాతం)
- పాండిచ్చేరికి 52 మెగావాట్లు(2శాతం)
- ఎవరికీ కేటాయించనిది (అన్ అలాటెడ్) 364 మెగావాట్లు(14శాతం)

ప్రతిష్ఠాత్మకమైన అమెరికా పవర్ అవార్డు సొంతం..

అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అమెరికాకు చెందిన పవర్ మేగజైన్ రామగుండం ఎన్టీపీసీని ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుల్లో ఒకటిగా గుర్తించింది. మేగజైన్ ఎడిటర్ల కమిటీ గుర్తించిన 7 అత్యుత్తమ ప్లాంట్లలో రామగుండం ప్లాంటుకు ప్రపంచంలో 2015 ఏడాదికిగాను టాప్ ప్రాజెక్టుగా అవార్డును ప్రకటించింది. 130 ఏళ్ల చరిత్ర ఉన్న పవర్ పత్రిక అవార్డు లభించడం అంటే నోబుల్ ప్రైజ్ వచ్చినట్లుగా ప్రపంచంలోని విద్యుత్ సంస్థలు భావిస్తాయి.



ప్రాజెక్టుకు లభించిన అవార్డులు..

రామగుండం ఎన్టీపీసీకి ఈ 47 సంవత్సరాలలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో టస్కర్ నుంచి నాలుగు నేషనల్ అవార్డులను సాధించింది. ఎనర్జీ ఎఫిషియెన్సీ 2024 అవార్డు, ఎనర్జీ లీడర్‌షిప్ 2024 అవార్డు గ్రీన్‌టెక్ జాతీయ సేఫ్టీ ప్లాటినం అవార్డు, బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు, పలుమార్లు స్వర్ణశక్తి అవార్డులు, విశ్వకర్మ జాతీయ అవార్డులు లభించాయి.

సామాజిక బాధ్యత..

విద్యుత్ ఉత్పత్తితో పాటు సామాజిక బాధ్యతపైన కూడా యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నది. గత 16 ఏళ్లలో సంస్థ సుమారు 500 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. స్వచ్ఛ భారత్‌లో రెండేళ్ల క్రితం తెలంగాణలోని 4 జిల్లాలో 11 కోట్ల రూపాయలతో 777 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించారు. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, ఆరోగ్యం, వ్యవసాయానికి, స్వయం ఉపాధి కోసం సంస్థ చేయూతనిస్తోంది. సీఎస్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా లక్షలాది రూపాయల ఖర్చుతో వివిధ సౌకర్యాలను కల్పిస్తోంది.

పర్యావరణ పరిరక్షణకు కృషి..

పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్టీపీసీ విశేష కృషి చేస్తున్నది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో లక్షలాది మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తోంది. ఎన్టీపీసీ పరిసర ప్రాంతంలో సుమారు 14 లక్షల చెట్లను సంస్థ సంరక్షిస్తున్నది. ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద సమస్యను నివారించడానికి సిమెంటు, ఇటుకల పరిశ్రమలకు బూడిదను సరఫరా చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రాజెక్టుకు గతంలోనే ఐఎస్‌వో-14001 గుర్తింపు లభించింది.

సమష్టి కృషితో ప్రగతి పథంలో ఎన్టీపీసీ

కేదార్ రంజన్ పాండు, ఆర్ఈడీ



ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికుల సమష్టి కృషి ఫలితంగా రామగుండం ప్రాజెక్టు ప్రగతి పథంలో నడుస్తోంది. రక్షణతో కూడిన నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యతని స్తున్నాం. ఉత్పత్తి, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సీఎస్ ఆర్, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. ఎన్టీపీసీ రేజింగ్ డే సందర్భంగా సిబ్బందికి, ఈ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు.





సీఎస్ఆర్ కింద పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, 1983లో మొదటి యూనిట్‌ను ప్రారంభిస్తున్న అప్పటి జీఎం ఎం.ఎ.హాయ్ (ఫైల్)

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

- రెండో రోజు వ్యవసాయ కళాశాల విద్యార్థుల కల్చరల్ మీట్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

తంగళ్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ రాష్ట్రస్థాయి ఇంటర్ కాలేజీ కల్చరల్ మీట్‌లో బుధవారం విద్యార్థుల ప్రదర్శన పలువురుని ఆకట్టుకుంది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో ప్రారంభమైన రెండవ రోజు కల్చరల్ మీట్ లో విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రోజులపాటు సాగే కల్చరల్ మీట్ లో తెలంగాణలోని 11 వ్యవసాయ కళాశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు, 200 అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం వివిధ కళాశాల చెందిన విద్యార్థులు జానపద నృత్యం, ముకాభినయం, నాటిక లను ప్రదర్శించారు. అలాగే పలు అంశాలపై డిబేట్, క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. నేడు కల్చర్ మీటు ముగింపు కార్యక్రమం ఉంటుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కోరుట్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోన వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణం బుధవారం వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపి ప్రత్యేక వేదికపై అలివేలు మంగ, లక్ష్మిపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించి కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.



స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కులగణనలో బీసీలందరూ పాల్గొనాలి

- అగ్రకులాల కుట్రను తిప్పికొట్టాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కులగణనలో ఎలాంటి అపోహలకు, సందేహాలకు తావు లేకుండా బీసీ కులాల ప్రజలంతా పాల్గొనాలని, బీసీ కులాల లెక్కలు తేలడానికి సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆ ధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కులగణన చైత న్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రై మాట్లాడారు. బీసీ కులాల లెక్కలు జరగకుండా అనేక మంది కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ కుట్రలను ఛేదించి బీసీలంతా అప్రమత్తంగా ఉండి వారి కులాన్ని తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచిం చారు. సమగ్ర కులగణన సేకరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగు లపై కులగణన వ్యతిరేకులు అక్కడక్కడ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

అటువంటి వారిని ప్రభు త్వం గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కులగణనపై కొందరు కావాలనే లేనిపోని అపోహవా లు సృష్టించి ప్రజల్ని తీవ్రగందరగోళంలోకి నెట్టివేస్తున్నార న్నారు. కులగణనలో పేర్కొన్న ఆర్థికపరమైన అంశాలు చెబితే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దక్కవని, అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారని తెలిపారు. సమగ్ర కులగణన ద్వారా బీసీ కులాల లెక్కలు తేలితే భవిష్యత్తులో తమ పీఠాలకే ఎసరు వస్తుందనే ఉద్దేశంతో కొంత మంది రాజకీయ ముసుగులో అగ్రకుల నేతలు కులగణనపై ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కుల గణలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన 56 ప్రశ్నలకు తమకు ఇష్ట మున్న సమాచారాన్ని అందించి, కులాన్ని మాత్రం తప్పని సరిగా చెప్పాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చైతన్య సదస్సుల ద్వారా బీసీ కులాలను చైతన్యం చేస్తున్నామని అయన తెలిపారు. కులగణనపై సందేహాల ను తీర్చడానికి సచివాలయంలో టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజులకు ఒకసారి ఉన్నత స్థాయి సమీక్ష సమా వేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జీఎస్ ఆనంద్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల మధు, జిల్లా అధ్యక్షుడు నాగుల కనుకయ్య, రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, అంజయ్య గౌడ్, మాదాసు సంజీవ్, సురేం దర్, వట్టి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠ శాలకు చెందిన శివకుమార్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కొడిమ్యాలలో జరగిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచాడు. దీంతో ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పాఠ శాలల వాలీబాల్ పోటీలలో శివకుమార్ ఉమ్మ డి కరీంనగర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించ నున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు అనుపమ, పీడీ విశ్వప్రసాద్ తెలిపారు. శివకుమార్‌ను పాఠశాల ఛైర్‌పర్సన్ అర్షనపల్లి రజిత, హెచ్ ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినం దించారు.

కొనసాగుతున్న గురుకుల క్రీడా పోటీలు



మానకొండూర్ గురుకుల పాఠశాలలో జమ్మికుంట-రుక్మాపూర్ కబడ్డీ మ్యాచ్

మానకొండూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధరకాల అంశాల్లో పోటీలు నిర్వహిం చారు. రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన 1190 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. గురువారం క్రీడల ముగింపు కార్యక్రమం, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యో తి):ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసు కను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.ఇల్లంతకుంట సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచా రం మేరకు దాడులు చేసినట్లు పేర్కొన్నా రు. రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని వంతడుపులకు చెందిన నర్సయ్య, బా బు, కంది కట్కూర్‌కు చెందిన అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పల్లె ప్రకృతి వనం చెట్లు నరికిన వారిపై కేసు

వీణవంక నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్కల్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం చెట్లను నరికిన వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పల్లె ప్రకృతి వనంలో కోర్కల్‌కు చెందిన పూదరి కృష్ణ, ఊదరి అనిల్‌గౌడ్ మరి కొంతమందితో కలిసి 32 చెట్లను నరికివేశారన్నారు. కోర్కల్ పంచాయతీ కార్యదర్శి బొడ్డు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బేగంపేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌పై చీటింగ్ కేసు నమోదు

రామగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మండే హేమపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. కొన్ని రోజులుగా ఖాతాదారులకు సంబంధిం చిన డబ్బులను వారి ఖాతాల్లో జమచేయకుండా సొంత అవసరాలకు వాడు కోవడం, అదేవిధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల అకౌంట్ ఖాతాదారుల వద్ద డబ్బులు తీసుకుని వారికి దొంగ పాస్‌బుక్కులు జారీ చేశారు. ఈ విషయమై విచారణ చేపట్టిన పోస్టల్ అధికారులకు 54మంది బాధితుల వద్ద 34లక్షల87వేల 22 రూపాయలు దుర్వినియోగం చేసినట్లుగా గుర్తించారు. దీనిపై గోదావరిఖని పోస్ట్ ఆఫీసు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం మంథని సీఐ రాజు, ఎస్ఐ చంద్రకుమార్‌లు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని పలువురు బాధితులను అడిగి తెలుసుకున్నారు. మిగతా ఎవరైనా బాధితులు ఉన్నట్లైయితే స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా సీఐ సూచించారు.

ఒకరి అరెస్టు

కోనరావుపేట నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని పట్టా చేయిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పెద్దపల్లి స్వామి అనే రైతు పొలం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎండీ పాషా అనే వ్యక్తి పట్టా చేయిస్తానని నమ్మబలికాడు. మోసపూరితంగా రూ.40 వేలను తీసుకున్నాడు. పట్టా చేయమంటే చేయకుండా తప్పించుకుంటున్నాడు. బాధితుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు చోట్ల వాహనాలను పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. ఇందిరాచౌక్‌తోపాటు పలు కూడళ్లలో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి వివరాలు సేకరించి ప్రశ్నించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలతోపాటు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తనిఖీ చేశారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులను చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్ గ్రామ శివారులో గంజాయి సేవిస్తూ పట్టుబడిన నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్సై కిరణ్‌కుమార్‌తో కలిసి వివరాలను తెలిపారు. మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్ గ్రామానికి చెందిన కండెల రవితేజ, రత్నాపూర్‌కు చెందిన సుద్దపల్లి సాయికుమార్ ఇద్దరు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఎస్సైతో కలిసి దాడులు చేశామన్నారు. వారి వద్ద ఉన్న సుమారు 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారు కొంత కాలం నుంచి గంజాయి తీసుకొచ్చి వాటిని చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లోని యువతకు విక్రహిస్తున్నట్లు తెలిపారన్నారు. నిందితులైపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌యూలో ఏఐపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి విష్ణువర్ధన్

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా కృత్రిమ మేధా (ఏఐ), దాని అనువర్తనాలు అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కూమార్ మాట్లాడుతూ, కృత్రిమ మేథ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తుందన్నారు. ముఖ్యంగా వైద్యరంగంలో చాలా మార్పులను తీసుకువస్తుందని తెలిపారు. అనంతరం హైదరాబాద్ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బి విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచాన్ని శాసించబోయే టెక్నాలజీగా కృత్రిమ మేధను అభివర్ణించారు. సైన్స్‌కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జయంతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధపై అవగాహన ప్రతీ ఒక్కరికి అవసరం అని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం అర్జున్ గౌడ్, జి నరసింహచారి, విజయేశ్వరి, ఇతర విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలం ప్రత్యేక బస్సులకు విశేష ఆదరణ

- ఇకపై ప్రతీ పౌర్ణమికి ప్రత్యేక బస్సులు
- ఆర్టీసీ ఆర్‌ఎం ఎస్ సుచరిత

భగత్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంలో పౌర్ణమిగిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకోసం కరీంనగర్ రీజియన్ పరిధిలో నడిపించిన ఐదు ప్రత్యేక బస్సులకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభించినట్లు ఆర్‌ఎం సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, హుస్నాబాద్, వేములవాడ, గోదావరిఖని, జగిత్యాల నుంచి కార్తీకపౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం ఐదు బస్సులను వేయగా అన్ని బస్సుల్లో సీట్లు పూర్తికావడమే కాకుండా, ఇంకా చాలా మంది అరుణాచల క్షేత్రానికి వెళ్లేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇకపై ప్రతీ పౌర్ణమి రోజున ప్రత్యేక బస్సులను నడిపిస్తామని ఆర్‌ఎం తెలిపారు.

'పీఎం సూర్యఘర్'తో సౌర వెలుగులు

- తగ్గనున్న విద్యుత్ చార్జీల భారం
- సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ. 78 వేల వరకు సబ్సిడీ



ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

చలికాలమైనా, ఎండ కాలమైనా ఫ్యాన్లు, ఏసీలు వేసుకోక తప్పని వాతావరణం... దిగువ మధ్య తరగతి కుటుంబమైనా.. అల్పాదాయ కుటుంబమైనా కూలర్, రిఫ్రిజిరేటర్, టీవీ సాధారణమైన రోజులు ఇవి.... దీంతో విద్యుత్ వినియోగం ఎక్కువైపోయి చార్జీల భారం తడిసిమోపెడవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నెలకు200 యూనిట్ల వినియోగం వరకు జీరో బిల్ ఇస్తూ ఆ చార్జీల భారాన్ని మోస్తున్నా దిగువ మధ్యతరగతి కుటుంబానికి నెలకు 250నుంచి 300 యూనిట్లకు వరకు విద్యుత్ వినియోగం తప్పనిసరి అవుతోంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి 'సూర్య ఘర్.. ముఫ్త్ బిజిలీ యోజన' ప్రజలకు వరంగా మారింది.

● కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలు

సౌరవిద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రెండు కిలో వాట్ల సామర్థ్యంగల సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకునేందుకు కిలో వాట్‌కు 30 వేల రూపాయలు సబ్సిడీగా ఇస్తోంది. రెండు కిలో వాట్స్ ప్యానళ్ల ఏర్పాటుకు 60 వేలు, అదనంగా మరో కిలో వాట్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే 18 వేల సబ్సిడీని ఇస్తుంది. మూడు కిలో వాట్స్ సామర్థ్యం వరకు గృహావసరాల కోసం ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే 78వేల సబ్సిడీని పొందే అవకాశం ఉన్నది. ఆపై కెపాసిటీ ఉన్న ప్యానళ్లను అమర్చుకుంటే 78వేల రూపాయల సీలింగ్‌తో సబ్సిడీ అందజేస్తున్నది. 150 యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్నవారు రెండు కిలో వాట్స్ వరకు 150 నుంచి 300 విద్యుత్ వినియోగం ఉన్నవారు రెండు నుంచి మూడు కిలో వాట్స్ వరకు, 300 యూనిట్లపై వినియోగం ఉన్నవారు మూడు కిలో వాట్స్ సామర్థ్యం ఉన్న ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. మూడు కిలోవాట్స్ సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవడానికి 2.10 లక్షల నుంచి 2.35 లక్షల రూపాయల వరకు ఖర్చు వుతుంది. ఇందులో 78వేల రూపాయలు కేంద్రం సబ్సిడీ పోను వినియోగదారుడు 1.52 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది.

● మిగులు విద్యుత్‌ను అమ్ముకునే అవకాశం

మూడు కిలో వాట్‌ల సోలార్ ప్యానళ్ల నుంచి నెలకు వాతావరణ పరిస్థితుల మేరకు 320 నుంచి 340 యూనిట్ల సోలార్ పవర్ ఉత్పత్తి అవుతుంది. వినియోగదారుడు అందులో250 యూనిట్లను వినియోగించుకుంటే మిగిలిన 90యూనిట్ల విద్యుత్‌ను డిస్కమ్ కొనుగోలు చేస్తుంది. 250యూనిట్ల విద్యుత్ వినియోగించుకుంటే యూనిట్ చార్జీలు, ఇతర చార్జీలు కలుపుకొని 2,500 రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఈ బిల్లు తప్పడంతోపాటు మిగిలిన 90 యూనిట్ల విద్యుత్‌కు డిస్కమ్ యూనిట్‌కు ఐదు రూపాయల చొప్పున 450 రూపాయలు చెల్లిస్తుంది. వినియోగదారుడు సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు 1.52 లక్షలు వెచ్చిస్తే నెలకు మూడు వేల రూపాయల విలువ చేసే విద్యుత్‌ను పొందే అవకాశమున్నది.

● బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం

సోలార్ విద్యుత్ కోసం వినియోగదారులు తమ ఇళ్ల లో ఎలక్ట్రిసిటీ ఫిట్టింగ్‌ల్లో ఎలాంటి మార్పులు చేసుకో వలసిన అవసరం లేదు. ఇంటికి ఉన్న మీటర్‌ను మార్చి దాని స్థానంలో ఇన్‌పుట్, అవుట్‌పుట్ సదుపాయముండే ప్రత్యేక మీటరును అమర్చుతారు. ఈ మీటరుతో సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తిఅయ్యే విద్యుత్‌ను వినియోగించుకోగా మిగిలింది ఎప్పటికప్పుడు డిస్కమ్‌లకు చెందిన గ్రిడ్‌కు వెళ్లిపోతుంది. రాత్రి పూట వినియోగదారులు డి స్కమ్‌ల నుంచి సరఫరాఅయ్యే విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. డిస్కమ్‌లు ఇంటిలో ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్ ఎంత, వినియోగించుకున్నది ఎంత... లెక్కించి మిగిలిన విద్యుత్‌కు యూనిట్‌కు ఐదురూపాయల చొప్పున యజమానికి చెల్లిస్తారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకో వడానికి బ్యాంకులు రుణసౌకర్యాన్ని ఏడు శాతం వడ్డీపై అందిస్తున్నాయి. హౌసింగ్ సొసైటీ గ్రూపులకు, అపార్టుమెంట్లకు, రెసి డెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు కేంద్ర ప్రభుత్వం కిలోవాట్‌కు 18 వేల రూపాయల చొప్పున మూడు కిలోవాట్స్ సోలార్ ప్యానళ్ల వరకు 54వేల సబ్సిడీని అందజేస్తుంది. ఈ సంస్థలు రిజిస్టర్‌అయి ఉండాల్సి ఉంటుంది.

● పెరుగుతున్న ఆదరణ

ఉమ్మడి జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లా సెస్ పరిధిలో ఉన్నది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీ ఎల్) పరిధిలో ఉండడంతో ఈ జిల్లాల్లో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధనవనరుల అభివృద్ధి సంస్థ (టీజీఆర్ ఈడీసీవో) లిమిటెడ్ ద్వారా పీఎం సూర్యఘర్.. ముఫ్త్ బిజిలీ యోజనను అమలుచేస్తున్నారు. ఇప్పటి వరకు కరీంనగర్ జిల్లాలో 529 మంది, జగిత్యాలలో 205మంది, పెద్దపల్లిలో 208 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి ఇళ్లలో సోలార్ విద్యుత్ ప్యానళ్లను అమర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● ప్రభుత్వ కార్యాలయాల్లో సౌరవిద్యుత్

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏర్పాటును తప్పనిసరి చేస్తూ కలెక్టర్లకు లేఖలు రాశారు. ఈ అంశంపై టీజీ రెడ్‌కో అధికారులు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మార్కెట్ గోడౌన్లు, కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్లలో సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయని రెడ్‌కో జిల్లా మేనేజర్ సందీప్‌కుమార్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె లక్ష్మీకాంతరావు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించే విద్యుత్‌కు ఎన్‌పీడీసీఎల్‌కు యూనిట్‌కు తొమ్మిది రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ పథకం కింద సోలార్ విద్యుత్ యూనిట్‌కు 3.74 రూపాయల మాత్రమే చార్జీలుగా తీసుకోనున్నారు. ఈ విద్యుత్ వినియోగంతో ఒక్కో యూనిట్‌పై ప్రభుత్వానికి ఐదు రూపాయలపైగానే ఆదా అయ్యే అవకాశముండడంతో అన్ని కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయని చెప్పారు. గృహ వినియోగానికి సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు విషయంలో ప్రజలకు అవగాహన పెరిగిందని, ఇప్పుడిప్పుడే ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా సబ్సిడీ పొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు.

కొత్త బియ్యంతో అన్నం ముద్దలవుతోంది

- రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి



గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌సీవో అంజలి

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త బియ్యంతో సరిగా వండకపోవడంతో అన్నం ముద్దలుగా మారి విద్యార్థులు ఇబ్బంది పడ్డారని రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి తెలిపారు. మండలంలో రామకృష్ణకాలనీలోని గన్నేరువరం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలను రీజినల్ కో ఆర్డినేటర్ అంజలి బుధవారం సందర్శించారు. పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థులకు ముద్దలుగా మారిన అన్నం పెడుతున్నారని పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ మేరకు ఆర్‌సీవో అంజలి పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బందితో కలిసి డైనింగ్‌హాల్‌కు వెళ్లి వంట చేసే వారితో మట్లాడానన్నారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త బియ్యాన్ని ఎలా వండాలనే విషయంపై వంటలు చేసేవారిని సూచనలు చేశామన్నారు. ఇక ముందు అన్నం మెత్తగా కాకుండా చూసుకుంటామని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అభినందించారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన అండర్-14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. రామగుండంలో అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కరాటే అసోసియేషన్ ప్రతినిధులు తగరపు శంకర్, సురేష్, శ్రీనివాస్, శంకర్, రాజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

ఆలయాలకు కార్తీక శోభ



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురిలో కార్తీక భక్తుల సందడి

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం కార్తీక భక్తుల సందడి నెలకొంది. స్థానిక లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు.

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పన్నెండవ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయంలో ..

వేములవాడ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కార్తీకదీపోత్సవం కొనసాగుతోంది. బుధవారం రాజన్న ఆలయ అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఓపెన్ స్లాబ్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక కార్తీకదీపాలను వెలిగించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాధరణ భక్తుల రద్దీ నెలకొంది. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు ముందుగా తలనీ లాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించారు.



వేములవాడలో కార్తీక దీపోత్సవం

రాజన్న సేవలో తొగుట పీఠాధిపతి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని తొగుట పీఠాధిపతి మాధవనంద సరస్వతి స్వా మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దాల మండపంలో అర్చకులకు, అధికా రులకు ప్రసాదం అంద జేశారు.

యూనివర్సిటీ మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి కృషి

- శాతవాహన వీసీ ఉమేష్ కుమార్
- ఎస్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



జెండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఉమేష్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ నిర్వహణ కోసం సింథటిక్ ట్రాక్ నిర్మించేందుకు కృషి చేస్తానని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అంతర్ డిగ్రీ కళాశాలల మహిళలు, పురుషుల అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో రాణిస్తుండడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే శాతవాహన క్రీడాకారులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. యూనివర్సిటీ మైదానంలో వరుసగా రెండు సంవత్సరాలపాటు పీ సెట్‌ను విజయవంతంగా నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో క్రీడల్లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్, ఎస్‌యూ ఫిజికల్ డైరెక్టర్ విజయకుమార్, వివిధ డిగ్రీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు నాగేశ్వర్‌రావు, శ్రీధర్ రావు, పి శ్రీనాథ్ రెడ్డి, దినేష్ పర్వీన్, కడారి రవి, వరుణ్ కృష్ణ, దేవిక, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

- శరవేగంగా ట్రాక్ మరమ్మతులు
- ఇతర మార్గాల ద్వారా పలు రైళ్ల మళ్లింపు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీ, దక్షిణ మధ్య రైల్వే జీఎం, కలెక్టర్



పట్టాలను సరిచేస్తున్న కార్మికులు, యంత్రాలు

పెద్దపల్లి రూరల్/పాలకుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ రైల్వే స్టేషన్, కన్నాల మధ్య మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఢిల్లీ, చెన్నై, సికింద్రాబాద్‌లకు వెళ్లే సుమారు 31 రైళ్లను రద్దు చేయడంతో పాటు పలు రైళ్లను దారి మళ్లించారు. ఘటనా స్థలాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సందర్శించి ప్రమాద వివరాలు అడిగితెలుసుకున్నారు. త్వరగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల మార్గంలోని ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సంఘటనా స్థలాన్ని సందర్శించి సింగరేణి సంస్థతో మాట్లాడి ఘటనా స్థలానికి భారీ క్రేన్‌లను వచ్చే విధంగా చర్యలు చేపట్టి పనులను ప్రారం భించారు. ఆయన వెంట పాలకుర్తి తహ సీల్దార్ జ్యోతి, పలువురు అధికారులు ఉన్నారు.



పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

● 31 రైళ్లను రద్దు చేసిన అధికారులు

పెద్దపల్లి జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన దృష్ట్యా అధికారులు 31 రైళ్లను రద్దు చేయడంతో పాటు పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. నర్సాపూర్- సికింద్రబాద్, సికింద్రబాద్- నాగ్‌పూర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్ - కరీంనగర్, కరీంనగర్ - బోధన్, సిర్పూర్ టౌన్- భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-బల్లార్ష, బల్లార్ష-కాజీపేట, యశ్వంత్‌పూర్- ముజఫర్‌పూర్ రైళ్లను రద్దు చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- విజయోత్సవాలకు నిధులుంటాయి కానీ బకాయిలకు లేవా?
- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విజయోత్సవం నిర్వహించడానికి నిధులు ఉంటాయి కాని.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడానికి లేవా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆర్థికలోటు ఉందంటూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విజయోత్సవాలను నిర్వహించకుండా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గురుకులాలల్లో తరుచుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని, విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడంలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి 11నెలలు అవుతున్నా ట్రిబుల్ ఐటీ ఊసెత్తడం లేదని మండిపడ్డారు. యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులభర్తీ చేయడం లేదన్నారు. విద్యారంగంపై ఇప్పటివరకు సమీక్ష లేదని, విద్యరంగ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళదామంటే అపాయింట్‌మెంట్ దొరకడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామరాపు వెంకటేష్, మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, శ్రావణ్, సాయి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సమాజ చైతన్యమే లక్ష్యంగా కళాప్రదర్శనలు

కోల్‌సిటీటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజ చైతన్యమే లక్ష్యంగా కళా ప్రదర్శనలు ఉండాలని పలువురు వక్తలు అన్నారు. నియర్ అండ్ డియర్ ఫ్రెండ్లీ ఆర్గనైజేషన్, రామగుండం ట్రస్మా ఆధ్వర్యంలో విద్యావిలువలు అంశంతో ఇటీవల నిర్వహించిన లఘు చిత్రాల పోటీ విజేతలకు బుధవారం గోదావరిఖని మార్కండేయకాలనీలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రామగుండం ఎంఈవో చంద్రయ్య, టీవీ,సినీనటులు వాలి సత్యప్రకాష్, సంస్థ అధ్యక్షుడు పీఎస్ అమరేందర్, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేశవరెడ్డి, బుచ్చిరెడ్డి, సీనియర్ పాత్రికేయుడు మల్లావరపుల వంశీ, దయానంద్ గాంధీ, మేజిక్‌రాజా, సంస్థ ప్రధానకార్యదర్శి దామెర శంకర్, విజయానంద్, సంజీవ్, డాక్టర్ మంద భాస్కర్, పొన్నం విజయ్‌కుమార్, వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఫిర్యాదు

పెద్దపల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని పెద్దపల్లి మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ గాదె మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. రంగంపల్లి తన నివాసంలో భర్త మోహనక్రిష్ణారెడ్డితో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమకు చెందిన 28 గజాల భూమిని మరిదికి 2018లో దానంగా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశామని, అనంతరం ఆ భూమిని లీజుకు తీసుకొని కిరాయి చెల్లిస్తున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు తనమరిది కుటుంబానికి లేనిపోని అనుమానాలు సృష్టించి తమ మధ్య గొడవలు పెట్టించారని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి, చంపుతామని బెదిరింపులకు గురిచేయగా పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. త్వరలో పరువునష్టం దావా వేస్తామని తెలిపారు.

షీటీమ్‌పై అవగాహన

కోల్‌సిటీటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని గుడ్‌మార్నింగ్ హైస్కూల్‌లో బుధవారం షీటీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ మెంబర్ స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్‌చేసి తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ సభ్యుడు సురేష్, పాఠశాల కరస్పాండెంట్ సమ్మారావు, డైరెక్టర్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ఊర సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

ఎలిగేడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన వీవోకు చెందిన డబ్బులు దుర్వినియోగంపై విచారణ జరపాలని అదేగ్రామానికి చెందిన గౌతమి డ్వాక్రా మహిళ సంఘ సభ్యులు మండల అభ్యుదయ సమాఖ్య ముందు ఆందోళన నిర్వహించారు. అధికారులు వెంటనే స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ విషయంపై ఏపీఎం సుధాకర్‌ను వివరణ కోరగా నిధుల దుర్వినియోగంపై డీపీఎం విచారణ చేస్తు న్నారని, అందులో దోషిగా తేలితే తనపై ఎలాంటి చర్యలు తీసుకున్నా తాను సిద్ధంగా ఉన్నానని వివరించారు.

వైద్యుల నిర్లక్ష్యం.. మహిళ ప్రాణానికి సంకటం

- పురిటిలోనే శిశువు మృతిపై ఆందోళన



అమ్రినా సుల్తానా నుంచి వివరాలు సేకరిస్తున్న మెడికల్ ఆఫీసర్ మాణికేశ్వర్‌రెడ్డి

కళ్యాణ్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యుల తీరుతో ఓ మహిళ ప్రాణానికి సంకటంగా మారింది. స్థానిక మార్కండేయ కాలనీకి చెందిన అమ్రీనసుల్తాన ఈనెల 6న ప్రసవం కోసం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరింది. లేబర్ రూంకు తీసుకువెళ్లిన వైద్యులు రాత్రి వరకు కూడా ప్రసవం చేయకపోవడంతో అమ్రీనసుల్తాన గర్భంలో ఉన్న శిశువు ఉమ్మనీరు మింగడంతో ఆమె శరీరం మొత్తం చల్లబడి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో వైద్యులు సిజేరియన్ చేయడానికి ప్రయత్నించగా అప్పటికే శిశువు తిరగబడి తలభాగమే బయటకు వచ్చి మిగతా భాగం లోపలే ఉండిపోయింది. ఎట్టకేలకు శిశువును బయటకు తీసిన వైద్యులు ఎంజీఎం ఆసుపత్రికి శిశువు తీసుకువెళ్లాలని సూచించినట్లు అమ్రీన బంధువులు తెలిపారు. శిశువును కరీంనగర్ వరకు తీసుకువెళ్లి తిరిగి గోదావరిఖని ఆసుపత్రికి తీసుకువచ్చారు. అమ్రీన పరిస్థితి కూడా విషమంగా మారడంతో చికిత్సను అందిస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందినట్టు బంధువులు ఆరోపిస్తున్నారు.

హెచ్‌వోడీ లేకపోవడం వల్లనే..

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సకాలం వైద్యసేవలు అందక శిశువులు గర్భంలోనే మృతిచెందుతున్నారు. నెలలోపే ముగ్గురు శిశువులు మృతిచెందడం కలవరపెడుతుండగా ఆపరేషన్ సమయంలో హెచ్‌వోడీ లేకపోవడం జూనియర్ డాక్టర్లకు హైదరాబాద్‌లో ఉండి ప్రసవాలు చేయాలని సూచించడం తో జూనియర్లే దిక్కవుతున్నారు. నార్మల్‌ప్రసవాలకు వేచిచూడటం వల్ల కొంత మంది సకాలంలో ప్రసవాలు జరగక ఇబ్బందులు గురవుతున్నారు. ఆసుపత్రిలో గైనిక్ వైద్యులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియనిపరిస్థితి నెలకొంది. నిత్యం ఏదో ఒక్క సంఘటన జరగడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు సేకరించిన మెడికల్ ఆఫీసర్

గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అమ్రినా సుల్తాన ఆరోగ్య పరిస్థితిపై అడ్డగుంటపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మాణికేశ్వర్ రెడ్డి వివరాలు సేకరించారు. గతంలో అడ్డగుంట పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందిన అమ్రిన ప్రసవం కోసం గోదావరిఖని ప్రభుత్వాసుత్రిలో చేరగా గర్భంలో శిశువు మృతిచెందింది. దీనిపై మాణికేశ్వర్‌రెడ్డి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

ఎమ్మెల్యే చొరవతో దీక్ష విరమణ

పాలకుర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీలో పర్మినెంటు కార్మికులకు మెరుగైన బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 10 రోజులుగా పర్మినెంటు యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి చేస్తున్న రిలే నిరాహార దీక్షను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవతో బుధవారం విరమించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్ని రోజులుగా దీక్ష చేస్తున్న తనకు సహకరించి సంఘీభావం తెలిపిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. పర్మినెంటు యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఉన్నతాధికారులతో చర్చలు జరపడంతో అధికారులు నాలుగు రోజులు గడువు కావాలని కోరడంతో దీక్షను విరమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేష్, పర్శవేణి శ్రీనివాస్, పోతుల ప్రసాద్ పాల్గొన్నారు. చర్చల్లో ప్లాంట్ హెడ్ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఆర్ మెనేజర్ పి ప్రార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో కార్తీక సందడి..



కార్తీక పురాణ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తీక సందడి నెలకొంది. పట్టణంలో నలభై ఐదు సంవత్సరాలు నుంచి కార్తీక జ్యోతితో నగర సంకీర్తన చేస్తున్నారు. బుధవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు స్వయంపాకం కోసం సరుకులు, కూరగాయలు సమర్పించుకున్నారు. బుధవారం శివాలయంలో దీపోత్సవం నిర్వహించారు. ఆలయం అవరణ నిండా దీపాలతో నింపారు. మహిళలు దీపాలు చేతులతో పట్టుకుని మంగళహారతులు పాడారు. పండితులకు దీప దానాలు చేశారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఓదెల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుదవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష మండలంలో విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఓదెల మండలంలోని కొలనూరు, లంబాడి తండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను కలెక్టర్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద వచ్చిన ధాన్యాన్ని ప్యాడీక్లీనర్ల ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు.సన్న రకం ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ పక్కాగా చేయాలని, ప్రతి కుటుంబం వివరాలు సేకరించాలని, ఏ ఒక్క కుటుంబం కూడా మిస్ కావడానికి వీల్లేదని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఓదెల మండల తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో తిరుపతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

ఓదెల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కనగర్తిలో దాసరి రాధ అనారోగ్యంతో మృతిచెందగా, బుధవారం మృతురాలి కుమారుడు దాసరి రమేష్‌ను ఎంపీ వంశీకృష్ణ, మాజీ ఎంపీ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి కారణాలను అడిగితెలుసుకుని ఓదార్చారు. అంతకుముందు ఓదెలలో కాంగ్రెస్ నాయకుడు అల్లం సతీష్ కూతురి శుభకార్యానికి హాజరై హర్షితను ఆశీర్వదించారు. వీరివెంట ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య, కాసారపు ఐలయ్య, సామ రాజేందర్, దేశిని కోటీ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణాలేంటి..?

(5వ పేజీ తరువాయి)

భాగంలో నీటి నిలువలు చేరడం వల్ల ట్రాక్ కుంగుబాటుకు గురై ఉంటుందా లేక, ట్రాక్ ఇరుపక్కల వాటర్ స్టోరేజీ వల్ల ట్రాక్ దెబ్బ తిని ఉంటుందా అన్న విషయాన్ని కూడా తెలుసుకునే పనిలో రైల్వే అధికారులు నిమగ్నం అయ్యారు. ఒకవేళ ట్రాక్‌కు ఇరుపక్కల నీటి నిలువ కారణంగానే అక్కడ పట్టాలు కుంగిపోవడం వల్లే ప్రమాదం జరిగినట్టయితే నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన డ్రైన్ వ్యవస్థ సరిగా లేదా అన్న విషయంలోనూ ఆరా తీయాల్సి ఉంటుంది. ఒక్క గూడ్సు రైల్ పట్టాలు తప్పడంతో 20 నుంచి 30వరకు ట్రైన్లు రద్దు చేయడంతో పాటు దారి మళ్లించాల్సి వచ్చిందని, దీనివల్ల రైల్వే శాఖపై అదనపు ఆర్థిక భారం పడినట్టేనని స్పష్టం అవుతోంది. ఈ నేపథ్యంలో గూడ్సు రైల్ పట్టాలు తప్పిన ఘటనపై సమగ్ర విచారణ జరిపినట్టయితే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

● ట్రయల్ రన్ విజయవంతం

రాఘవాపూర్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో దెబ్బతిన్న ట్రాక్ పనులను పునరుద్ధరించే పనిలో రైల్వే యంత్రాంగం నిమగ్నం అయ్యింది. మంగళవారం అర్ధరాత్రే రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్‌ను బాగు చేస్తున్నారు. కానీ గూడ్సు రైల్ కోచులు పట్టాలు తప్పడంతో ఈ ప్రాంతం మీదుగా వెళ్తున్న మూడు ట్రాకులు కూడా ధ్వంసం అయిపోయాయి. బుధవారం రాత్రి వరకు రెండు ట్రాక్‌ల మీదుగా ట్రయల్ రన్ నిర్వహించగా విజయవంతం అయ్యింది. దీంతో గురువారం ఉదయం వరకు రైళ్ల రాకపోకలు కొనసాగించే అవకాశం ఉంది.

బీఆర్‌ఎస్ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారు

కళ్యాణ్‌నగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అహర్నిషలు కృషి చేస్తుంటే బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు కౌశిక హరి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చందర్, నాయకుడు కౌశిక హరిలు గోదావరిఖనిని బొందలగడ్డగా మార్చినప్పుడు ఎందుకు మాట్లాడలేదని వారు ప్రశ్నించారు. రామగుండం అభివృద్ధికి అనేక నిధులు తెచ్చిన ఎమ్మెల్యేను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని, ఇక్కడ కొత్తగా వ్యాపారాలు రావడం లేదని, సింగరేణి స్థలాల్లో అక్రమ కట్టడాలు కూల్చివేసి వాటి స్థానంలో పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు రావాలనే పట్టుదలతో ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, గత ఎమ్మెల్యే ఎప్పుడు కూడా రామగుండం అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, కౌశిక హరి ఎన్‌టీపీసీ, సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగాల్లో అవినీతి జరిగిందనడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గుండేటి రాజేష్, అనుమ సత్యనారాయణ, ఆడెపు రవి, అల్లి శంకర్, మాటేటి సతీష్, గుండేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ధర్మారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మారంలో బాబూ జగ్జీవన్ రామ్ భవనానికి కాంపౌండ్ నిర్మించడకోసం నిధుల మంజూరు చేయాలని కోరుతూ, ఏఎంసీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమర్ కలిశారు. సానుకూలంగ స్పందించిన లక్ష్మణ్ కుమార్ 5 లక్షల రూపాయలకు ప్రొసీడింగ్ త్వరలో ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తూరి మల్లేశం, కాంపెల్లి రాజేశం, బొల్లి అరుణ్, ముల్కాల రవి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సర్వేను సమగ్రంగా నిర్వహించాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపడుతున్న కుటుంబ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని పెద్దపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకల్వలలో సమగ్ర కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఇంటంటా తిరుగుతూ ప్రతి ఒక్కరూ సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలని ఎంపీడీవో ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిషాంత్‌రావు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ

కోల్‌సిటీటౌన్, నవంబర్ 13(ఆన్‌లైన్): అనుకోని పరిస్థితుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలను సమయస్ఫూర్తితో, అవగాహనతోనే నివారించి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడేందుకు అవకావశం ఉంటుందని అగ్నిమాపక అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అగ్ని ప్రమాదాలపట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటర్మీడియట్ నోడల్ అధికారి,కళాశాల ప్రిన్సిపాల్ డి.కల్పన మాట్లాడుతూ విద్యార్థినులు అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి శంకర్, అధ్యాపక సిబ్బంది సంపత్, రజిత, రమేష్, బాణయ్య, శ్రీనివాస్, రాజు, వివేకానంద, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పాలకుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి, గుడిపెల్లి గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో పొల్సాని శశికళ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మక్కాన్‌సింగ్ సేవ సమితి చైర్మెన్ మనాలి ఠాకూర్ మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, సీనియర్ రెవెన్యూ అసిస్టెంట్ పోచం, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, నాయకులు అనవేని నాగేష్,కొప్పు ప్రసాద్, మాదాసు శ్రావణ్, కాసర్ల కిరణ్, జంగ సాగర్, కేశిరెడ్డి భూమ్‌రెడ్డి, కొరండ్ల సుధాకర్‌రెడ్డి, భూషనవేణి తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కరస్పాండెంట్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలలో గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. 2024-25లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కి చెందిన 9వ తరగతి విద్యార్థులు బండి చరణ్, పెగడ శ్రీశాంత్‌లు పాల్గొని ప్రశంసా పత్రాలు సాధించినట్లు చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తద్వారా పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండటం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి ప్రశంసా పత్రాలు సాధించిన విద్యార్థులను, పీఈటీ స్రవంతి, రాజు, అనిల్‌లను అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ అభినందించి, జాతీయ స్థాయిలో కూడా రాణించి పతకాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, పీఈటీ స్రవంతి, రజియుద్దీన్ పాల్గొన్నారు.



అవయవ దానంపై అవగహన



డోనర్ కార్డులతో ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా బుధవారం ఆర్జీ-2 ఎంవీటీసీ శిక్షణా కేంద్రంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అవయవ, నేత్ర దానాలపై అవగాహన కల్పించారు. మరణానంతరం మట్టిలో వృథధాగా కలిసిపోయే అవయవాలు మరొకరి జీవితాన్ని ఇస్తాయని, ప్రజల్లో అవయవ దానంపై నెలకొన్న అపోహలు తొలగిపోయేలా సింగరేణి ఉద్యోగులు చైతన్యపరచాల్సిన అవసరం ఉన్నదని లింగమూర్తి తెలిపారు. ఈసందర్భంగా 40మంది ఉద్యోగులు అవయవదానాన్ని అంగీకరించడంతో డోనర్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీటీసీ ఇంచార్జి నాగెల్లి సాంబయ్య, సూపర్‌వైజర్లు సతీష్, తిరుపతితోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన సదస్సు

రామగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో బుధవారం మధుమేహంపై అవగాహన సదస్సును నిర్వహించారు. అంతర్జాతీయ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకోని ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఏరియా ఆసుపత్రి వైద్యురాలు పద్మ ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో అధికారులు జనార్ధన్, రమేశ్, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు గంగాధర్, కొమురయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీకాలనీలో నకిలీ నోట్ల చలామణి

రామగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీ వారాంతపు సంతలో నకిలీ నోట్ల చెలమణి జరుగుతోంది. ప్రతి బుధవారం జరిగే వారసంతలో నాలుగు వారాలుగా నకిలీ నోట్లు దర్శనమిస్తుండడంతో చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో ఎవరిని కదలించినా నకిలీ నోట్లు ఇచ్చారంటూ వాపోతున్నారు. రాత్రి వరకు కొనసాగే మార్కెట్‌లో విద్యుత్ సౌకర్యం లేని కారణంగా నకిలీ నోట్ల ముఠాకు వరంగా మారింది. ఉదయం కంటే రాత్రి జరిగే వ్యాపారమే ఎక్కువగా ఉండడంతో నకిలీ నోటు ఏదో అసలు నోటు ఏదో గుర్తించే అవకాశం చిరువ్యాపారులకు లేకుండా పోతోంది. ఈ విషయమై పోలీసులు దృష్టి సారించాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

హక్కుల సాధన, యూనియన్ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధన యూనియన్ బలోపేతం కోసం ప్రతి ఒక్క నాయకుడు పని చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ నాయకులకు సూచించారు. ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ కే సదానందం ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని ఐఎన్‌టీయూసీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమాశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా పాలన ఏర్పడిన తరువాత పెండింగ్‌లో ఉన్న అనేక హక్కులు సాధించామన్నారు. ముఖ్యంగా కార్మికుల కృషి ఫలితంగా ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఉత్పత్తి, లాభాలు సాధించటమే కాకుండా కార్మికుల కోసం డిపెండెంట్ ఉద్యోగుల వయోపరిమితి 35నుంచి 40ఏళ్లకు పెంపు, రామగుండంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, 800మెగావాట్ల పవర్ ప్లాంట్లు, ఒడిసాలో నైని ప్రాజెక్టు నిర్మాణం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు, కోటి రూపాయల ప్రమాద బీమా, స్థానికులకే 80శాతం ఉద్యోగాలు, సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం, బీసీ లైజనింగ్ ఆఫీసర్ నియామకం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ధర్మపురి, వంగ లక్ష్మీపతిగౌడ్, వడ్డేపల్లి దాస్, వికాస్‌కుమార్‌యాదవ్, కొత్త సత్యనారాయణరెడ్డి, ఆరేపల్లి శ్రీనివాస్, గడ్డం కృష్ణ, పోచయ్య, గంగ్ర దామోదర్, సమ్మయ్య యాదవ్, అన్వేష్, శారద, మల్లికార్జున్, జగన్మోహన్, గుండేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2, 3ల్లో టార్గెట్ కమిటీ పర్యటన



ఆర్జీ-3 అధికారులతో చర్చిస్తున్న టార్గెట్ కమిటీ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో కార్పొరేట్ టార్గెట్ కమిటీ బుధవారం పర్యటించింది. కమిటీ కన్వీనర్ కార్పొరేట్ జీఎం(సీపీఅండ్‌పీ) మనోహర్ ఆధ్వర్యంలో జీఎం(ఓసీపీలు) డీవీఎస్ సూర్యనారాణరాజు, జీఎం (పీపీ) సాయిబాబాలతో కూడిన కమిటీ జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో సమావేశమయ్యారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను, బొగ్గునాణ్యతలపై చర్చించారు. ఓసీపీ-3, వకీల్‌పల్లె గని స్థితిగతులు, పనిస్థలాల వివరాలు, యంత్రాలు, పరికరాలు, విడిభాగాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏడాది వార్షిక లక్షాలను సాధిస్తున్న ఆర్జీ-2 ఏరియా వచ్చే ఆర్థిక సంవత్సర లక్ష్యాలను సాధించేలా ప్రణాళితో పనిచేయాలని కమిటీ కన్వీనర్ మనోహర్ సూచించారు. ఈ సమావేశలో అఫీషియేటింగ్ జీఎం మధుసూదన్, సంతోష్‌కుమార్, రాజాజీ, మురళీకృష్ణ, ఎర్రన్న, నర్సింగరావు, చంద్రశేఖర్, రవికిరణ్, రహమత్ అలీ, సుభాష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో కార్పొరేట్ టార్గెట్ కమిటీ బుధవారం పర్యటించింది. కమిటీలో ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు విభాగం జీఎం మనోహర్, ఓసీపీల జీఎం డివిఎస్ సూర్యనారాయణరాజు, ప్లానింగ్‌అండ్ ప్రాజెక్టు విభాగం జీఎం సాయిబాబా, ఐఈ ఏజీఎం వెంకయ్యలు పర్యటించారు. అనంతరం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుతో పాటు వివిధ గనుల, ప్రాజెక్టు అధికారులతో సమావేశం నిర్వహించారు.2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం, ప్రణాళికలు, బొగ్గు ఉత్పత్తి, రవాణా, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయశేఖరబాబు, రఘుపతి, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, రాజశేఖర్, చంద్రశేఖర్, మదార్, సిబ్బంది పాల్గొన్నారు.


సీఎస్ఆర్ నిధుల వినియోగంపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్జీ-2 అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సమాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల వినియోగం, చేపట్టిన పనుల పురోగతిపై సింగరేణి డైరెక్టర్ (పా, పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం(సీఎస్ఆర్, ఈఈ) బెర్నేడేట్ నికోలస్‌లు బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల అధికారులతో సమావేశమ య్యారు. సీఎస్ఆర్ కింద 2014-15 నుంచి 2018-19 వరకు మంజూరైన సీఎస్ఆర్‌ల స్థితి, 2019-20, 2020-21కి సంబంధించిన ప్రాజెక్టులపై చర్చించారు. ప్రతి ప్రాజెక్టు ఇచ్చి తప్పైన స్థితి, దానిని పూర్తి చేయడానికి టైమ్‌లైన్, ప్రాజెక్టులను పూర్తి చేయడానికి టైమ్‌లైన్, పూర్తయిన తర్వాత ఏవైనా పొదుపులు, ఏవైనా సవరణ ప్రతిపాదనలు, 2022-23, 2024-25 వరకు మంజూరుచేయబడిన ప్రాజెక్టుల స్థితివంటి వివరాలను అన్ని ఏరియాల అధికారులను అడిగి డైరెక్టర్(పా) తెలుసుకున్నారు. సీఎస్ఆర్‌పై కేటాయించిన పనులు త్వరగా పూర్తిచేయాలని, పూర్తి అయిన ప్రాజెక్టుల ఫోటోలు, ఇతర వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆర్జీ-2 అధికారులకు డైరెక్టర్(పా) సూచించారు. ఈ సమావేశంలో ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, అధికారులు ధనుంజయ, నితిన్‌కుమార్ పాల్గొన్నారు.

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కుల అందజేత



చెక్కును అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-2లో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఉప్పుల వెంకటేశ్వర్లు, గాదం విద్యాసాగర్‌ల కుటుంబాలకు బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు చేతుల మీదుగా ఒక్కో కుటుంబానికి రూ.20లక్షల చొప్పున మ్యాచింగ్ గ్రాంట్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, గుర్రం శ్రీహరి, మురళీ, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు జూపాక రాంచందర్, కొట రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.